క్లుప్తంగా

కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు


అమ్మవారికి మంగళ హారతి ఇస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీ చౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో జ్యేష్ఠ అమావాస్య శుక్రవారం పురస్కరించుకొని కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం చేపట్టి ప్రత్యేకంగా అలంకరించారు. ఒడి బియ్యం కార్యక్రమం జరిపించి పుష్పాభిషేకం అనంతరం మహామంగళ హారతులు ఇచ్చారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణలు చేపట్టారు. చివరగా నవవిధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కాళీమాత సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

లోక కల్యాణం కోసం హోమాలు


ప్రథమ నందీశ్వర ఆలయంలో హోమాలు నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని ప్రథమనందీశ్వర స్వామి దేవస్థానంలో శివుడి జన్మ నక్షత్రమైన ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకొని శుక్రవారం వేదపండితుల ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ఉదయాన్నే పంచామృతాభిషేకాలు, మహాన్యాస పూర్వక ఏకరుద్రాభిషేకం పూజలు జరిపించారు. అనంతరం గణపతి, లక్ష్మీ, రుద్ర పాశుపత హోమాలు నిర్వహించి పూర్ణాహుతి గావించారు. అనంతరం మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈఓ రామాంజనేయశర్మ, వేదపండితులు ప్రవీణ్ పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల నుంచి పిల్లలను రక్షించాలి


మాట్లాడుతున్న సీడీపీఓ తేజేశ్వరీ

ఆళ్లగడ్డ: లైంగిక వేధింపుల నుంచి పిల్లలను రక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీడీపీఓ తేజేశ్వరీ అన్నారు. సంకల్ప్ హ్యు వంద రోజుల ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో భాగంగా స్థానిక బాలసదనంలో శుక్రవారం నియోజకవర్గ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలపై లైంగిక వేధింపుల నియంత్రణ, జీవన నైపుణ్యాలపై పోస్టర్లను ఆవిష్కరించారు. సూపర్‌వైజర్లు దస్తగిరమ్మ, పార్వతి, సుశీల, స్వర్ణలత, రషీద, లక్ష్మిదేవి, దీప్తి ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం


మాయలూరులో మలేరియాపై పోస్టర్ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ఉయ్యాలవాడ : సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి అశోక్ తెలిపారు. మాయలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని తుడుమలదిన్నె, అల్లూరు, మాయలూరు గ్రామాల్లో శుక్రవారం ఆరోగ్య సిబ్బంది ఆశా వర్కర్లతో కలిసి ఆరోగ్యం పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. చిన్న పిల్లలు, వృద్ధులు దోమల బారిన పడకుండా దోమతెరలు వాడాలని సూచించారు. ఆరోగ్య సమస్యలను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉన్న వైద్యశాలకు వెళ్లి వైద్యులతో పరీక్షలు చేయించుకుని మందులు వాడాలని చెప్పారు.

నేటి నుంచి ఆషాడమాస వేడుకలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని జగజ్జననీ నగర్‌లో వెలసిన జగజ్జననీ ఆలయంలో శనివారం నుంచి ఆషాడ మాస వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు దుర్గా ఫ్రెండ్స్ యూనిట్ సభ్యులు పుల్లయ్య, నారాయణ శుక్రవారం తెలిపారు. వారు మాట్లాడుతూ ప్రతి రోజూ అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమాలు, కల్యాణం నిర్వహిస్తామన్నారు. అలాగే అమ్మవారికి పుట్టింటి పట్టుచీర, సారె తదితర కార్యక్రమాలు భక్తుల నుంచి స్వీకరిస్తామని చెప్పారు.

కలెక్టర్‌కు ఆత్మీయ వీడ్కోలు

నంద్యాల: అధికారులు, సిబ్బంది ప్రజల సహకారంతో అత్యంత బాధ్యత యుతమైన కార్యక్రమాలు చేపట్టి విజయవంతం చేశామని కలెక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో బదిలీపై వెళ్తున్న జిల్లా కలెక్టర్‌కు రెవెన్యూ యంత్రాంగం, జిల్లా అధికారులు సంయుక్తంగా ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సాధారణ ఎన్నికలు, రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన, శివరాత్రి, ఉగాది మహోత్సవాల కార్యక్రమాల్లో ఎలాంటి లోటు పాట్లు లేకుండా విజయవంతంగా నిర్వహించామన్నారు. గతంలో తాను ఆర్డీఓగా, డీఆర్‌డీఏ పీడీ, డ్వామా పీడీ, భూసేకరణ ప్రత్యేక కలెక్టర్, జేసీ డెవలప్‌మెంట్, హౌసింగ్, జాయింట్ కలెక్టర్‌గా పనిచేసి క్షేత్ర స్థాయిలో విశేష అనుభవం, జిల్లా అధికారులు, సిబ్బంది సహకారంతో విజయవంతంగా పనులు పూర్తి చేశామన్నారు. జిల్లాలో ఉత్తమ అధికార యంత్రాంగం, సిబ్బంది ఉన్నారని ఎలాంటి కార్యక్రమాలైనా విజయవంతంగా నిర్వహించే సామర్థ్యం వీరి సొంతమన్నారు. కలెక్టర్‌గా గత ఐదు నెలల కాలంలో ఎన్నికల విధుల నిర్వహణ కారణంగా ఇతర ఆర్థిక అంశాలకు సంబంధించిన ఫైలు క్లియర్ చేయలేకపోయామని, సాధారణ బదిలీ ఉన్న నేపథ్యంలో ఆర్థిక అంశాలకు సంబంధించిన ఫైల్స్‌ను క్లియర్ చేసేందుకు అవకాశం ఉండదన్నారు. జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్



వీడ్కోలు సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు


జిల్లా కలెక్టర్ శ్రీనివాసులును సత్కరిస్తున్న జేసీ రాహుల్ కుమార్ రెడ్డి, అధికారులు

రెడ్డి మాట్లాడుతూ అందరినీ కలపుకొని నిర్దేశిత వ్యవధిలో పనులు పూర్తి చేయాలని సూచనలు ఇచ్చేవారన్నారు. విధి నిర్వహణలో ఉత్తమ పనితీరు కనపరిచి ఇతరులకు స్ఫూర్తిగా నిలిచారన్నారు. సమస్యల పరిష్కారంలో సూచనలు చేసి ప్రోత్సహించారన్నారు. అంతకుముందు జిల్లా రెవెన్యూ అధికారి అధ్యక్షతన జరిగిన వీడ్కోలు సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, ఆర్‌డీఓలు మల్లికార్జునరెడ్డి, దాసు, జెడ్పీ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, డీసీహెచ్ఎస్ జఫ్రూలా, డీపీఓ మంజులవాణి, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ బషీరున్నిసా, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు గనుల శాఖ ఏడీ రామచంద్ర, ఆర్అండ్‌బీ ఎస్ఈ శ్రీధర్ రెడ్డి, రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ సభ్యులు కలెక్టర్ సేవలను కొనియాడారు. అనంతరం జిల్లా అధికారులు కలెక్టర్‌ను ఘనంగా సత్కరించారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

రుద్రవరం: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకునే బాధ్యత మన అందరిపై ఉందని స్థానిక ఏపీ మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరావు అన్నారు. వన మహోత్సవంలో భాగంగా శుక్రవారం స్థానిక పాఠశాల ప్రాంగణంలో ప్రిన్సిపాల్, పీడీ శ్రీనివాసులు, అగ్రికల్చర్ టీచర్ జ్యోతి ప్రియ తదితరులు విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పచ్చదనం పెంపొందించినప్పుడే పర్యావరణం మెరుగుపడి వాతావరణం సమతుల్యత ఏర్పడుతుందన్నారు.


రుద్రవరం మోడల్ స్కూల్ ఆవరణలో మొక్క నాటుతున్న దృశ్యం

ఎంవీఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

నంద్యాల(అర్బన్): స్థానిక వాల్మీకి కార్యాలయంలో శుక్రవారం ఎంవీఆర్‌పీఎస్ (మహర్షి వాల్మీకి రిజర్వేషన్ ప్రజా సమితి) మొదటి ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు బోయ పులికొండన్న, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లాలుస్వామి, ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. వారు మాట్లాడుతూ వాల్మీకుల ఎస్టీ పునరుద్ధరణే లక్ష్యంగా వాల్మీకులు ముందుకు కదలాలని పిలుపునిచ్చారు. జయరాం, మధుగోపాల్, రాజునాయుడు, పరమేష్, మల్లి, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

నిర్మాణాల్లో నాణ్యత లోపిస్తే రికవరీ తప్పదు

ఉయ్యాలవాడ: నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాల్లో తేడాలొస్తే కాంట్రాక్టర్ల నుంచి రికవరీ చేస్తామని క్వాలిటీ కంట్రోలర్ డీఈ మోహన్‌రావు తెలిపారు. శుక్రవారం స్థానిక ముస్లింల శ్మశాన వాటికకు రూ.20 లక్షల ఎంపీ ల్యాండ్స్ నిధులతో నిర్మించిన ప్రహరీ, శ్రీ వేణుగోపాల స్వామి ఆశ్రమానికి వెళ్లే రహదారిలో గడప గడప నిధుల ద్వారా రూ. 20 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డు, మండలంలోని ఇంజేడు, బోడెమ్మనూరు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్ల నిర్మాణాల నాణ్యతను పరిశీలించారు. నిర్మాణాల్లో భాగంగా సిమెంట్, కంకర, స్టీల్, ఇసుక మేరకు వినియోగించారో పరికరాల ద్వారా నమూనాలు తీసుకుని నంద్యాల ల్యాబ్‌కు పంపనున్నట్లు చెప్పారు. ఏఈలు లక్ష్మయ్య, రామకృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


ముస్లింల శ్మశాన వాటిక ప్రహరీ నాణ్యతను పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోలర్ అధికారులు

- ఆళ్లగడ్డలో అనుమతులు లేని రూ.7.25లక్షల విత్తనాలు స్వాధీనం
- రుద్రవరంలో రూ.9లక్షల ఎరువులు సీజ్

ఆళ్లగడ్డ: నకిలీ, నాసిరకం, గుర్తింపు లేని విత్తనాలు రైతులకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని వ్యవసాయ శాఖ విజిలెన్స్ అధికారులు రామ్మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, సిద్దయ్య తెలిపారు. పట్టణంలోని పలు విత్తన దుకాణాల్లో శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. వారు మాట్లాడుతూ దుకాణాదారులు నాణ్యమైన, గుర్తింపు పొందిన విత్తనాలు మాత్రమే విక్రయించాలని సూచించారు. వ్యవసాయ శాఖ ద్వారా అనుమతి పొందిన బిల్లు బుక్కుల నుంచి మాత్రమే రసీదు ఇవ్వాలని చెప్పారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పట్టణంలో సరైన అనుమతి పత్రాలు లేని రూ.7,25,625 విలువగల విత్తనాలను సీజ్ చేశామని తెలిపారు. టెక్నికల్ ఇన్‌స్ట్రక్టర్ నాగేంద్రప్రసాద్, ఏఓ కిషోర్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

రుద్రవరం: మండల కేంద్రం రుద్రవరంలోని పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో జిల్లా విజిలెన్స్,ఎన్‌ఫోర్స్‌మెంట్,వ్యవసాయ శాఖ ప్రత్యేక బృందాలు అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం తనిఖీలు చేశారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. స్థానిక రాఘవ ట్రేడర్స్ దుకాణంలో అనుమతుల్లో పొందుపరచని, అనుమతి పత్రాలు లేని రూ.7,80,150 విలువజేసే ఎరువుల అమ్మకాలను నిలిపేశారు. అలాగే శ్రీజయశంకర్ ఏజెన్సీస్‌లో రూ.1,26,689 విలువజేసే ఎరువుల అమ్మకాలకు స్టాప్‌సేల్ ఇచ్చినట్లు చెప్పారు. ఏజీఎల్ సిద్దయ్య, ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి, నంద్యాల మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు, ఆళ్లగడ్డ సబ్ డివిజన్ వ్యవసాయ టెక్నికల్ అధికారి నాగేంద్రప్రసాద్, మండల ఏఓ శ్రీకృష్ణ, ఏఈఓ రాజు ఉన్నారు.

శిరివెళ్ల: స్థానిక ఎరువుల దుకాణాలను శుక్రవారం ఎన్టీఆర్ జిల్లా మైలవరంకు చెందిన ఏడీఏ శ్రీనివాసరావు తనిఖీ చేశారు. దుకాణాల్లోని ఎరువుల క్రయ విక్రయ రిజిష్టర్లు, గోదాముల్లోని నిల్వలను తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు, క్రిమిసంహారక మందులను అమ్మాలని యజమానులను ఆదేశించారు. రైతులకు రసీదులు ఇవ్వాలని, ధరల సూచిక బోర్డులను తప్పకుండా ఏర్పాటు చేయాలని సూచించారు. ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి, ఏఓ సుధాకర్ పాల్గొన్నారు.

చాగలమర్రి: స్థానిక శ్రీలక్ష్మీవెంకటేశ్వర సీడ్స్, ఎస్‌వీ ఏజెన్సీస్ విత్తన, ఎరువులు, క్రిమిసంహారక మందుల దుకాణాలను వ్యవసాయ కమిషనర్ కార్యాలయ ప్రత్యేక స్క్వాడ్ బృందం శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ బృందంలో ఏడీఏ శ్రీనివాసరావు,విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి సిద్దయ్య, ఆళ్లగడ్డ ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి ఉన్నారు. ఈ తనిఖీల్లో శ్రీలక్ష్మీ వెంకటసాయి సీడ్స్ దుకాణంలో రూ.78,000, ఎస్‌వీ ఏజెన్సీస్‌లో రూ.3 లక్షల విలువైన విత్తనాలకు సరైన పత్రాలు లేనందున అమ్మకాలు నిలిపివేసినట్లు తెలిపారు. ఏఓ రంగనేతాజీ, టెక్నికల్ ఏఓ నాగేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ


విత్తన దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న వ్యవసాయ శాఖ విజిలెన్స్ అధికారులు


ఎరువులను పరిశీలించి ప్రశ్నిస్తున్న విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

మాన్యం కౌలు వేలం వాయిదా

రుద్రవరం: స్థానిక భాస్కర నందీశ్వర,ఆంజనేయ స్వామి ఆలయాలకు సంబంధించిన మాన్యం కౌలు వేలం శుక్రవారం వాయిదా పడింది. దీంతో వేలం పాడేందుకు భాస్కర నందీశ్వరస్వామి ఆలయం వద్దకు వచ్చిన రైతులు చేసేది లేక వెనుతిరిగి వెళ్లారు. రెండు ఆలయాలకు కలిపి దాదాపు 36.79 ఎకరాల మాన్యం ఉంది. ఏటా కమిటీ సభ్యులు, దేవదాయ శాఖ అధికారులు ఓ తేదీని నిర్ణయించి వేలం ప్రక్రియ సాగించేవారు. అయితే ఈ సారి అలా జరగలేదు. కొందరు కమిటీ సభ్యులు కలిసి శుక్రవారం వేలం నిర్వహిస్తున్నామని రూ.5వేలు డిపాజిట్ చెల్లించి రైతులు వేలంలో పాల్గొనవచ్చని గ్రామంలో దండోరా వేయించారు. ఈ మేరకు శక్రవారం ఉదయం 10 గంటల నుంచి కొందురు రైతులు వేలం పాడేందుకు ఆలయం వద్దకు చేరుకున్నారు.అయితే ఉదయం11 గంటలు దాటినా కమిటీ సభ్యులు, దేవదాయశాఖ అధికారులు రాలేదు. దీంతో రైతు లు వెనుతిరిగారు. ఈ విషయంపై ఈఓ సాయిజయచంద్రారెడ్డిని వివరణ కోరగా.. ఇటీవల కౌలు వేలంపై కమిటీ సభ్యులు గురువారం దండోరా వేయించి తనకు సమాచారం ఇచ్చారని, అయినా ఉన్నతాధికారుల అనుమతులు లేకుండా వేలం నిర్వహించడం కుదరదని ఈనెల 9న వేస్తామని కమిటీ సభ్యులకు చెప్పి వేలం వాయిదా వేశామని తెలిపారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు


ఆలమూరులో బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న కార్మికులు


ఆర్.పాంపల్లెలో మురుగు నీటిలో వేస్ట్ ఆయిల్ చల్లిస్తున్న ఈఓపీఆర్‌డీ

రుద్రవరం: మండలంలోని ఆలమూరు,పెద్దకంబలూరు,ఎల్లావత్తుల తదితర గ్రామాల్లో శుక్రవారం పారుశుద్ధ్య మెరుగుకు చర్యలు చేపట్టారు. ఫ్రైడే.. డ్రైడేలో భాగంగా ఆయా గ్రామాల్లో సర్పంచుల ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్య కార్మికులతో వీధులన్నీ శుభ్రం చేయించారు. మురుగు ఉన్న చోట బ్లీచింగ్ పౌడర్,సున్నం,వేస్టు ఆయిల్ వంటివి చల్లించారు. అలాగే ప్రజలకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని ఈఓపీఆర్డీ శ్రీనివాసశర్మ పరిశీలించారు. కార్యదర్శులు పాములేటి,షాహినూర్,ఆశా వర్కర్లు ఉన్నారు.

ఉయ్యాలవాడ : గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహరించాలని ఈఓపీఆర్‌డీ మహీధర్‌రెడ్డి ప్రజలను కోరారు. శుక్రవారం డ్రైడే కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొండుపల్లె, ఆర్.పాంపల్లె, ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ గృహాల్లోని చెత్తా చెదారాన్ని మురుగు కాలువల్లో వేయరాదన్నారు. పంచాయతీ చెత్త సేకరణ వాహన సిబ్బందికి అందజేయాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించే వారికి పంచాయతీ కార్యదర్శులు నోటీసులు జారీ చేసి జరిమానా వసూలు చేయాలని ఆదేశించారు.

ఊపిరి పోసిన వర్షం


దొర్నిపాడు వద్ద మినుము పొలాల్లో కురుస్తున్న వర్షం

దొర్నిపాడు: ఖరీఫ్ సాగులో భాగంగా మండలంలో మినుము, మొక్కజొన్న పంటలను విస్తారంగా సాగుచేశారు. రెండు వారాలుగా వర్షాలు లేక పంటలు వాడుముఖం పట్టాయి. రోజూ సాయంత్రం మేఘాలు వెళ్తున్న చుక్క రాలకపోవడంతో రైతన్నలు మేఘాల వంక ఆశగా చూస్తున్నారు. అయితే శుక్రవారం మోస్తరు వర్షం కురవడంతో కాస్త ఊపిరి పీల్చుకున్నారు. ఎండ తక్కువగా ఉన్నప్పటికీ సెగ వాతావరణంతో పాటు గాలులు ఎక్కువగా ఉన్నాయని దీంతో పంటలు వేగంగా వాడుముఖం వేస్తున్నాయని అన్నదాతలు పేర్కొంటున్నారు.

బయలు వీరభద్రస్వామికి విశేష పూజలు


బయలు వీరభద్ర స్వామి పూజల్లో పాల్గొన్న అర్చకులు, ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహా క్షేత్రంలో శుక్రవారం అమావాస్యను పురస్కరించుకుని లోక కల్యాణం కోసం క్షేత్ర పాలకుడైన బయలు వీరభద్రస్వామి వారికి విశేషపూజలు నిర్వహించారు. ప్రతి మంగళవారం, అమావాస్య రోజుల్లో ఈ విశేషార్చనను జరిపించడం ఆనవాయితీ. అమావాస్య రోజున భక్తులు పరోక్షసేవగా ఈ అర్చనను జరిపించుకునే అవకాశం దేవస్థానం కల్పించింది. ఈ రోజు పరోక్షసేవ ద్వారా 18 మంది భక్తులు విశేష పూజలను జరిపించుకున్నారు. పూజాదికాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ చేపట్టారు. అనంతరం పంచామృతాలు, బిల్వోదకం, కుంకుమోదకం, హరిద్రోదకం, భస్మోదకం, గంధోదకం, పుష్పోదకం, శుద్ధ జలాలతో వీరభద్రస్వామివారికి అభిషేకం చేశారు.

నూతన సీఈఓకు రికార్డుల అప్పగింత


రికార్డులను అప్పగిస్తున్న కేడీసీసీ బ్యాంక్ మేనేజర్, మాజీ సీఈఓ ప్రసాద్

దొర్నిపాడు: స్థానిక సహకార సంఘం నూతన సీఈఓగా బాధ్యతలు చేపట్టిన హర్షవర్ధన్‌కు కోవెలకుంట్ల కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ అమర్‌నాథ్‌రెడ్డి శుక్రవారం రికార్డులు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాజీ సీఈఓ ప్రసాద్ రికార్డులను మేనేజర్‌కు అందజేశారు. ఆయన మాట్లాడుతూ 2019కి ముందు సొసైటీ నుంచి రూ.2కోట్ల వరకు రుణాలు ఇచ్చే వారని, గత ఐదేళ్లుగా రూ.16కోట్ల వరకు రుణాలు ఇస్తున్నామన్నారు. ప్రస్తుతం సొసైటీ అభివృద్ధి పథంలో నడుస్తూ రూ.63లక్షల ఆదాయంతో ఉందని వివరించారు.

జీవిత పరమార్థాన్ని తెలిపే శ్రీమద్రామాయణం


అన్నదానంలో పాల్గొన్న భక్తులు


గోమాతకు పూజలు చేసిన దృశ్యం

గోస్పాడు: మానవ జీవిత పరమార్థాన్ని తెలిపేది శ్రీమద్రామాయణమని హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వహకుడు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అన్నారు. స్థానిక శ్రీ సోమనందీశ్వర స్వామి దేవస్థానంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ధార్మిక ప్రవచనాలు శుక్రవారం ముగిశాయి. ఆయన మాట్లాడుతూ మానవుడు ఆదర్శంగా ఎలా జీవించాలో రామాయణం నేర్పుతుందన్నారు. ఈ సందర్భంగా శ్రీమద్రామాయణం, మహాభారతం, భగవద్గీతపై ఇస్కాన్ ధర్మ ప్రచారకులు నిత్యతృప్తదాస్ ప్రవచనాలు భక్తులను అలరించాయి. అనంతరం గోమాతకు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు అన్నదానం చేపట్టారు. గ్రామ వికాస రాష్ట్ర సంయోజక్ వడ్ల తిరుపతయ్య, జిల్లా అధ్యక్షుడు నాగరాజేశ్ కుమార్ రెడ్డి, దేవస్థానం వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీకంఠ నందీశ్వర శర్మ, సర్పంచ్ పరదేశి ప్రమీల, బాలన్న, అర్చకులు సురేశ్ శర్మ, చిన్నగురప్ప, తిమ్మయ్య, సుబ్బరాయుడు, కృష్ణుడు పాల్గొన్నారు.

18 నుంచి రాష్ట్రస్థాయి చెస్ టోర్నీ

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 18, 19వ తేదీల్లో ఆంధ్రప్రదేశ్ చెస్ సంఘం ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా చెస్ సంఘం నిర్వహణలో ఎస్‌బీఐ కాలనీలోనున్న రామకృష్ణ పీజీ కళాశాలలో రాష్ట్రస్థాయి చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా చెస్ సంఘం గౌరవాధ్యక్షులు డాక్టర్ రామకృష్ణారెడ్డి, అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, ప్రధాన కార్యదర్శి రామసుబ్బారెడ్డి, టోర్నమెంట్ స్పాన్సర్ రాజేష్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా చెస్ పోటీల పోస్టర్లను విడుదల చేశారు. టోర్నమెంట్ వేదికకు మునినాగలక్ష్మి స్మారక చెస్ టోర్నమెంట్‌గా నామకరణం చేసినట్లు చెప్పారు. వారు మాట్లాడుతూ 26 జిల్లాల నుంచి 300 మంది క్రీడాకారులు పాల్గొంటారన్నారు. ప్రతి జిల్లా నుంచి నలుగురు బాలలు, నలుగురు బాలికలు ప్రాతినిథ్యం వహిస్తారన్నారు. గతంలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో విజయాలు సాధించిన వారికి నేరుగా ప్రవేశం ఉంటుందన్నారు. విజేతలుగా నిలిచిన వారికి సెప్టెంబర్ 20 – 28వ తేదీ వరకు హర్యానాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రం తరపున పాల్గొంటారని చెప్పారు. ఈనెల 10వ తేదీ లోపు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్ : 9010451585 నంబరులో సంప్రదించాలని కోరారు.


పోస్టర్లను విడుదల చేస్తున్న అసోసియేషన్ నాయకులు

విద్యుత్ షాక్‌తో బిల్ రీడర్ మృతి

శిరివెళ్ల: మండల కేంద్రానికి చెందిన ట్రాన్స్‌కో బిల్ రీడర్ షేక్ జాకీర్ (35) శుక్రవారం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడని ఎస్ఐ సురేష్ తెలిపారు. వెంకటాపురం- యర్రగుంట్ల పొలాల మధ్యనున్న విద్యుత్ స్తంభంపైకి ఎక్కి విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తుండంగా షాక్ కొట్టడంతో పై నుంచి కింద పడి మృతి చెందాడు. మృతుడి భార్య హసీనా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. కాగా.. మృతుడికి కుమారుడున్నాడు.


మృతి చెందిన షేక్ జాకీర్

విద్యారంగ పరిరక్షణకు ఉద్యమిద్దాం

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు ఉద్యమించాలని ఆర్ఎస్‌యూ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఆర్ఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుమల్ల శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలో ఆర్ఎస్‌యూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. మణికంఠ చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 2014 జూలై 5న ఆర్ఎస్‌యూ ఆవిర్భవించిందన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు చేస్తామన్నారు. వెంకటేశ్వర్లు, శివ, మహేష్, వెంకటరమణ, నవీన్‌బాబు పాల్గొన్నారు.

డీలర్‌పై చర్యలు తీసుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): కొలిమిగుండ్ల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లును దూషించిన రేషన్ డీలర్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని పీఆర్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం డీఈఓ సుధాకర్‌రెడ్డిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామపక్కీర్‌రెడ్డి, భాస్కరరెడ్డి మాట్లాడుతూ దుర్భాషలాడిన డీలర్‌పై చర్యలు తీసుకోని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. అలాగే.. ఉన్నత పాఠశాలలో కొరతగా ఉన్న సబ్జెక్టు ఉపాధ్యాయులను పని సర్దుబాటుపద్ధతిలో నియమించాలని డీఈఓను కోరారు. కార్యక్రమంలో విజయరావు, నరసింహులు, శివ, ప్రసాద్, రఘు, కరీముల్లా, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


డీఈఓకు వినతి పత్రం ఇస్తున్న పీఆర్‌టీయూ నాయకులు